క్లుప్తంగా

సీఐగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



నెక్కొండ : స్థానిక సీఐగా ఎస్.శ్రీనివాస్ పోలీస్‌స్టేషన్‌లోని కార్యాలయంలో మంగళవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ చంద్రమోహన్ వరంగల్ కమిషనరేట్ పరిధిలోని సీఎస్‌బీకి బదిలీ అవగా సిరిసిల్ల డీసీఆర్‌బీలో సీఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. సీఐ శ్రీనివాస్‌ను ఎస్సై మహేందర్, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్‌ఎఫ్‌ఐ కమిటీ ఎన్నిక



వర్ధన్నపేట : పట్టణంలోని ఎస్టీ హాస్టల్ ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి ఇస్లావత్ కల్యాణ్ ఆధ్వర్యంలో కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాయి వర్షిత్, కార్యదర్శిగా శివలాల్, సభ్యులుగా ఎస్.శ్రీకాంత్, జి.శ్రీకాంత్, గణపతి, ప్రణయ్ ఎన్నికయ్యారు. అనంతరం కల్యాణ్ మాట్లాడారు. విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కమిటీ పని చేయాలని సూచించారు. కమిటీని అభినందించారు.

కరపత్రాల ఆవిష్కరణ



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 16వ డివిజన్‌కు చెందిన జాన్‌పాకలో ఆదివాసీ తోటి సంఘం నాయకులు తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా మహాసభ కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ ఆగబోయిన రవి, తోటి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుర్రం రఘు మాట్లాడారు. మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సోయం రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పర్వతగిరి : మండలంలోని ఏనుగల్లు గ్రామానికి చెందిన కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు సమీప బంధువు గుండ్రపు అమృతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మంగళవారం పరామర్శించారు. తొలుత అమృతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బియ్యం సాయం



రాయపర్తి : మండల కేంద్రానికి చెందిన పోలె ఎల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి బీజేపీ రాష్ట్ర నాయకుడు కర్ర శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం 50 కేజీల బియ్యం సాయంగా అందజేశారు. తొలుత బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నూనె అనిల్, మండల ప్రధాన కార్యదర్శి బూర్గు నవీన్, నాయకులు పెండ్యాల గణేశ్, మంచాల సుమన్, జక్కుల సందీప్, భాస్కర్, హరీశ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లికి తలకొరివి పెట్టిన కూతురు



నల్లబెల్లి : మండలంలోని నందిగామ గ్రామానికి చెందిన బొమ్మకంటి సుజాత(50) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందింది. ఆమెకు భర్త పోశయ్య, ఇద్దరు కుమార్తెలు శృతి, సృజన ఉన్నారు. భర్త వృద్ధాప్యంతో బాధపడుతుండగా కుమారులు లేకపోవడంతో తల్లి అంతిమ సంస్కారాలను స్థానికులు అందించిన ఆర్థికసాయంతో కుమార్తెలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత మృతదేహానికి చిన్న కుమార్తె సృజన కుండపట్టి తలకొరివి పెట్టింది. ఈ ఘటన గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. సుజాత మృతి, అంత్యక్రియలు గ్రామస్తులను కంటతడి పెట్టించాయి.

పల్లె దవాఖానాలో నీటి గోస

- నిరుపయోగంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు
- మహిళా ఉద్యోగులు, రోగులకు తీవ్ర ఇబ్బందులు



పాపయ్యపేటలోని పల్లె దవాఖానా



వృథాగా ఉన్న నీటి సంపు

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేటలోని పల్లె దవాఖానాలో నీటి గోస నెలకొంది. నీటి సరఫరాకు అవసరమైన అన్ని వసతులున్నా కనెక్షన్ ఇవ్వకపోవడంతో మరుగుదొడ్లు, మూత్రశాలలు నిరుపయోగంగా ఉన్నాయి. మహిళా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మండలంలోని పాపయ్యపేటలో వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ వైద్యసేవలు, మౌలిక వసతుల సదుపాయాల సంస్థ నుంచి రూ.20 లక్షల వ్యయంతో పల్లె దవాఖానా నిర్మించగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి గతేడాది సెప్టెంబర్ 23న ప్రారంభించారు. ఆస్పత్రిలో ఒక ఎంఎల్‌హెచ్‌పీ, ఇద్దరు ఏఎన్‌ఎంలు, ఆరుగురు ఆశ కార్యకర్తలు విధులు నిర్వహిస్తున్నారు. పాపయ్యపేట, ధర్మతండా, అమృతండా, బోజెర్వు, పుల్లయ్యబోడు తండా గ్రామాల ప్రజలు వైద్యసేవల కోసం పల్లె దవాఖానాను ఆశ్రయిస్తారు. కాగా ఆస్పత్రిలో నీటి సదుపాయం కల్పించేందుకు సంప్‌ను, భవనంపై ట్యాంకును నిర్మించారు. మిషన్ భగీరథ నల్లా అమర్చారు. సంపులో నుంచి నీటిని ట్యాంకులోకి ఎక్కించడానికి కనెక్షన్ ఇవ్వలేదు. విద్యుత్ మోటార్ సైతం సమకూర్చలేదు. దీంతో సంప్, వాటర్ ట్యాంక్ నిరూపయోగంగా ఉన్నాయి. ఇక ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది మాత్రమే కాకుండా వైద్యం కోసం వచ్చే మహిళలు, గర్భిణులు, ప్రజలు మరుగుదొడ్లోకి, మూత్రశాలకు వెళ్లాలంటే ఇబ్బంది పడక తప్పడం లేదు. ఈ పరిస్థితిలో మరుగుదొడ్లు, మూత్రశాలలు నిరుపయోగంగా మారాయి. పల్లె దవాఖానాను ప్రారంభించి ప్రారంభమై 5 నెలలు గడచినా నీటి సమస్య పరిష్కారం కావడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి నీటి సరఫరాకు ఏర్పాట్లు చేయించి సమస్యను పరిష్కరించాలని ఉద్యోగులు, రోగులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



ఆస్పత్రిలో నీటి సరఫరా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆస్పత్రికి వచ్చే రోగులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే తాగు నీటి సరఫరాకు అవసరమైన చర్యలు చేపట్టి ఉద్యోగుల, రోగుల ఇబ్బందులను దూరం చేయాలి.

– డాక్టర్ భవానీ, ఎంఎల్‌హెచ్‌పీ

బాధ్యుల దృష్టికి తీసుకెళ్తా



నీటి సమస్యను బాధ్యుల దృష్టికి తీసుకెళ్తా. నీరు లేక మహిళ ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను గతంలో పంచాయతీ కార్యదర్శికి తెలియజేశాం. నీటి కనెక్షన్ ఇస్తామని చెప్పారు. అయినా ఆ దిశగా ఏర్పాట్లు చేయలేదు. మళ్లీ ఆయన దృష్టికి తీసుకెళ్లి త్వరలో నీటి వసతి కల్పిస్తాం.

– సరోజ, వైద్యురాలు, పీహెచ్‌సీ

వివేకానందుడి స్ఫూర్తిని కొనసాగించాలి

- తహసీల్దార్ కృష్ణ



విద్యార్థులను సన్మానిస్తున్న తహసీల్దార్ కృష్ణ

నల్లబెల్లి : స్వామి వివేకానందుడి స్ఫూర్తిని కొనసాగించాలని తహసీల్దార్ కృష్ణ సూచించారు. స్వామి వివేకనంద జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాచరచన పోటీల్లో కేజీబీవీ విద్యార్థిని నవ్య ప్రథమ, రంగాపురం హైస్కూల్ విద్యార్థి రాంచరణ్ ద్వితీయ, కేజీబీవీ విద్యార్థిని శృతి తృతీయ స్థానంలో నిలవగా వారికి మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ కృష్ణ మంగళవారం బహుమతులు అందజేసి సన్మానించి మాట్లాడారు. స్వామి వివేకానందుడి జయంతి సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని చెప్పారు. స్వామి వివేకానంద వంటి మహనీయుల జీవితాలను విద్యార్థులు అధ్యయనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య, ఆర్ఐ కార్తీక్, కేజీబీవీ ఎస్ఓ సునీత తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు



చెన్నారావుపేట : మండలంలోని జీడిగడ్డతండాలోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఎస్సై రమాదేవి వివరాలు వెల్లడించారు. జీడిగడ్డ తండాలో దాడులు నిర్వహించి 1100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మోహన్, సరితలపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై శార్వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై..

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని గొర్రెకుంట ప్రగతి పారిశ్రామిక ప్రాంతంలో పేకాట శిబిరంపై గీసుకొండ పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మహేందర్ మీడియాకు వివరాలు వెల్లడించారు. గొర్రెకుంట శివారులో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా స్తంభంపెల్లి ఎఫ్‌సీఐ గోదాం వెనక కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని సమాచారం అందడంతో దాడి చేసినట్లు తెలిపారు. పేకాడుతున్న ఆరుగురు పారిపోతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.31 వేల 720 నగదుతోపాటు నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఆరుగురిపైనా కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

పోరాటాలతోనే ప్రజాసమస్యల పరిష్కారం

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

నర్సంపేట : పోరాటాలతోనే ప్రజాసమస్యలు పరిష్కారమవుతాయని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ తెలిపారు. పట్టణంలోని నెహ్రూనగర్‌లో ఇల్లందుల సాంబయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో రమేశ్ మాట్లాడారు. సమస్యలపై అధ్యయనం చేసి ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యయుత పోరాటాలు నిర్మిస్తున్న వందేళ్ల చరిత్ర పార్టీ సొంతమని చెప్పారు. దున్నేవాడికే భూమి కావాలని, భూస్వామ్య పెట్టుబడిదారీ విధానాలు పోవాలని, పేదలకు కూడు, గూడు, నీడ కోసం పోరాడి పేదలకు భూములు పంచినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడచినా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇందిరమ్మ భరోసా కింద అర్హులకు రూ.12 వేల చొప్పున సాయం అందించాలని, బకాయిలు చెల్లించి రాష్ట్రంలో ఆరోగ్య సేవలను పునరుద్ధరించాలని, ఇతర హామీలను సైతం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున పోరాటాలు తప్పవన్నారు. పాలకులు అవలంభిస్తున్న తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు ప్రజలను సన్నద్ధం చేయాలని శ్రేణులకు సూచించారు. తొలుత సీనియర్ నాయకుడు అన్నారం వీరస్వామి ఎర్ర జెండా ఎగరేశారు.

ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడి మృతి

చెన్నారావుపేట : పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఉప్పరపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కాసాని మల్లయ్య (59) ఈ నెల 18న పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు తొలుత నర్సంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో, తదనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎంలో చేర్పారు. కాగా మల్లయ్య పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు.

ఉద్యమాల ఫలితంగానే జీఓ విడుదల



హమాలీ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న మునీశ్వర్

- యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మునీశ్వర్

నర్సంపేట : ఉద్యమాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లయిస్ హమాలీల కూలీ రేట్లు పెంచుతూ జీఓ విడుదల చేసిందని సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జీఓ విడుదల చేయడం పట్ల పట్టణంలోని సివిల్ సప్లయిస్ గోదాం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో హమాలీలు స్వీట్లు పంచి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మునీశ్వర్ మాట్లాడారు. గతేడాది జరిగిన ఒప్పందాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో జనవరి 1వ తేదీ నుంచి సమ్మె చేసినట్లు తెలిపారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ మాట్లాడుతూ ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలరాజు సమస్యను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా హామీ ఇచ్చి సమ్మె విరమింపజేశారని చెప్పారు. ఈ క్రమంలోనే జీఓ విడుదలైందని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అక్కపెల్లి రమేశ్, సివిల్ సప్లై హమాలీ యూనియన్ నాయకులు సాంబయ్య, కొత్తగట్టు నర్సింహం, కిశోర్, మిట్టపల్లి మహేందర్, మాట్ల రవి, కుమారస్వామి, ముద్రబోయిన మహేందర్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం

దామెర : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ లకావత్ రాజేశ్‌కుమార్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. జిల్లా అధికారులుగా, ఉపాధ్యాయులుగా విద్యార్థులు వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థి దశ జీవితం అద్భుతమైందని అన్నారు. చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవీన్, రవీందర్, రమేశ్, సృజన, రుక్మిణి, శ్రీలత, మాధవి పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

- ఏసీపీ సతీశ్‌బాబు



మాట్లాడుతున్న ఏసీపీ సతీశ్‌బాబు

ఆత్మకూరు : శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని పరకాల ఏసీపీ సతీశ్ బాబు అన్నారు. మండలంలోని నీరుకుళ్లలో మంగళవారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీసీటీవీల ప్రాముఖ్యత, డయల్–100, రహదారి భద్రత నియామలు, సైబర్ నేరాలు, 1930 అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం వాహన తనిఖీలు చేపట్టి పత్రాలు లేని 10 వాహనాలకు రూ.3,200 జరిమానా విధించారు. కావటి లక్ష్మీనర్సు వద్ద నుంచి అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయగా, అక్రమ గుడుంబా రవాణా చేస్తున్న అజ్మీరా వెంకటేశ్‌పై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గుట్కాలు, అక్రమ మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. యువత సన్మార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు సంతోశ్, క్రాంతికుమార్, ఎస్సై పరమేశ్వర్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



ఖిలా వరంగల్ : వరంగల్ బొల్లికుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ సుబేదారి అధ్యక్షురాలు డాక్టర్ వీణావాణి ఆధ్వర్యంలో జిల్లా గ్యాట్ లీగల్ కో ఆర్డినేటర్ పుట్ట హరికిషన్ రెడ్డి సహకారంతో మంగళవారం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్,పెన్నులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం డాక్టర్ వీణావాణి మాట్లాడుతూ ప్రైవేట్ దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నతంగా ఎదగాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో భాస్కర్ రావు, హరికిషన్ రెడ్డి, ఆనంద్‌బాబు, రాజు గౌడ్, మహమ్మద్ రఫీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుగ్గొండి : చాపలబండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి



అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యేలు మాధవరెడ్డి, నాగరాజు
- గ్రామ, వార్డు సభల్లో ప్రజల అసహనం

సాక్షి నెట్‌వర్క్ : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, ఇతర సంక్షేమ పథకాలు అందుతాయని నర్సంపేట, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, నాగరాజు భరోసా ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా గ్రామ, వార్డు సభలు మంగళవారం మొదలయ్యాయి. పలు సభల్లో అర్హుల పేర్లు గల్లంతయ్యాయని, అనర్హులకు చోటు కల్పించారంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. దుగ్గొండి మండలంలో ఎమ్మెల్యే మాధవరెడ్డి, వర్ధన్నపేట మండలంలో ఎమ్మెల్యే నాగరాజు, డీఆర్‌డీఓ పీడీ కౌసల్యదేవి హాజరై మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా పేదలకు పథకాలు అందిస్తామని చెప్పారు. దరఖాస్తుల స్వీకరణను నిరంతర ప్రక్రియగా చెప్పారు. సంగెం, గీసుకొండ మండలాల్లో డీఆర్ఓ విజయలక్ష్మి, రాయపర్తి మండలంలో పాలకుర్తి నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ సంధ్యారాణి హాజరు కాగా నెక్కొండలో స్పెషల్ ఆఫీసర్ నాగరాజు, పర్వతగిరి, చెన్నారావుపేట మండలాల్లో సంబంధిత ఎంపీడీఓలు శంకర్‌నాయక్, శ్రీవాణి, ఖానాపురం మండలంలో స్పెషల్ ఆఫీసర్లు సౌజన్య, కిరణ్‌కుమార్, శ్రీనివాస్, సునీల్‌కుమార్ సభలకు హాజరై మాట్లాడారు. గీసుకొండ మండ లంలో క్యూ పెరిగిపోవడంతో దరఖాస్తుదారులు ఒకరి వీపుపై మరొకరు ఫాంలు పూర్తి చేశారు. రాయపర్తి మండలంలోని కేశవాపురంలో అధికారులను గ్రామస్తులు నిలదీశారు. ఉపాధి హామీ జాబ్ కార్డు లేకున్నా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ఇవ్వాలని కోరారు. దుగ్గొండి మండలంలోని నాచనపల్లిలో అధికారులు, గ్రామస్తుల నడుమ వాగ్వాదం చోటు చేసుకుంది. చెన్నారావుపేట, సంగెం, ఖానాపురం మండలాల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య గొడవ జరిగింది. నర్సంపేట మండలంలోని మాధన్నపేటలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరుతూ ఎంపీఓకు ఎంసీపీఐ(యూ) నాయకులు వినతిపత్రం అందజేశారు.



వర్ధన్నపేట : మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు



సంగెం : కాట్రపల్లిలో..



రాయపర్తి : కొండూరులో..



నెక్కొండ : మాట్లాడుతున్న ఎస్‌ఓ నాగరాజు



పర్వతగిరి : మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకర్



చెన్నారావుపేట : ధర్మతండాలో..

కాంగ్రెస్ హయాంలోనే బడుగుల అభివృద్ధి

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట : కాంగ్రెస్ హయాంలోనే బడుగుల అభివృద్ధి జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. నల్లబెల్లికి చెందిన బీఆర్‌ఎస్ శ్రేణులు ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బత్తిని మహేశ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో మంగళవారం చేరగా వారికి ఎమ్మెల్యే మాధవరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. పేదలందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామని, పార్టీ బలోపేతానికి కృషి చేసే వారికి సముచిత స్థానం లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, జిల్లా కార్యదర్శి మాలోతు రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, ఇస్తారు శేఖర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుషోత్తం, సురేశ్, డ్యాగల కృష్ణ, ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు బేతి భరత్, నాయకులు మాసంపల్లి అఖిల్, వద్లూరి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో రోడ్డు ప్రమాదాల నివారణ



విద్యార్థులకు కరపత్రాలు అందజేస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

- ఎంఈఓ లింగారెడ్డి

పర్వతగిరి : రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకుంటే ప్రమాదాలను చాలా వరకు నివారించగలమని ఎంఈఓ లింగారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో రోడ్డు ప్రమాదాలకు గల కారణాలు వివరించే కరపత్రాలను ప్రధానోపాధ్యాయుడు పాక రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఎంఈఓ లింగారెడ్డి మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు జరగడానికి కారణాలు, నివారణకు అవకాశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. డ్రంకన్ డ్రైవ్, ఓవర్ లోడ్‌తో ప్రయాణం, అతివేగంగా వాహనాలు నడపడం, రాంగ్ రూట్లో డ్రైవింగ్, తదితరాలపై వివరించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు నేడు (బుధవారం) మండల స్థాయిలో పోటీలు ఉంటాయని చెప్పారు.

మిషన్ ఆస్పత్రి భూములను పరిరక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సురేందర్ బాబు

ఖిలా వరంగల్ : అక్రమణకు గురైన బాప్టిస్టు చర్చి (మిషన్ ఆస్పత్రికి) సంబంధించిన భూములను పరిరక్షించాలని తెలుగు బాప్టిస్టు చర్చిల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సురేందర్ బాబు కోరారు. మంగళవారం వరంగల్ 41వ డివిజన్ ఉర్సు ప్రతాప్‌నగర్‌లోని తెలుగు బాప్టిస్టు చర్చి(టీబీసీ) ప్రాంగణంలో ఉమ్మడి జిల్లా టీబీసీ ఫీల్డ్ అసోసియేషన్ ప్రతినిధుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. చర్చికి సంబంధించిన ఆస్తులను కొందరు కబ్జాదారులు ఆక్రమించారన్నారు. ఉత్తర్వుల ప్రకారం జిల్లా అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణదారుల చేతిలో ఉన్న భూములను స్వాధీనపర్చి మిషన్ ఆస్పత్రిని కాపాడాలని కోరారు. సమావేశంలో టీబీసీ ఫీల్డ్ నాయకులు డీకే రవి, సుమన్, ప్రసంగి, రాజు, సునిల్‌పాల్, రాజు, సాల్మాన్, ప్రభాకర్, జయప్రకాశ్, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.